సాక్షి తిరుపతి
శనివారం । 16 । డిసెంబర్ । 2023



తస్మాత్ జాగ్రత్త

రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. - 8లో



కార్మికుడి మృతి

మేనకూరు సెజ్ పరిధిలోని ఓ పరిశ్రమలో కార్మికుడు ప్రమాదవశాత్తు కాలుజారి మృతిచెందాడు. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారికి అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. - 8లో

న్యూస్‌రీల్

స్విమ్స్‌లో వైద్యుల నియామకం



నియామకపత్రాలు అందుకున్న వైద్యులతో స్విమ్స్ డైరెక్టర్, అధికారులు

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్)లో శుక్రవారం శాశ్వత ప్రాతిపదికన 59 మంది వైద్యులను నియమించినట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన కొత్తగా నియమితులైన వైద్యులకు స్విమ్స్‌లో నియామకపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆదేశాల మేరకు స్విమ్స్ ఆస్పత్రిలో డాక్టర్ల నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చినట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా ఈనెల 11, 12, 13 తేదీలలో సెలెక్షన్ కమిటీ ద్వారా నిర్వహించిన ఇంటర్వ్యూలలో 59 మంది వైద్యులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇందులో ఒక ప్రొఫెసర్ పోస్టు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 9, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 49 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఏ.మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా, స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (పీఎం) ప్రసన్న లక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ బాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాసం

తిరుమల : శ్రీవెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబర్ 17వ తేదీన తెల్లవారుజామున 12.34 గంటలకు ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉదయం నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. కాగా ధనుర్మాస ఘడియలు 2024 జనవరి 14న ముగియనున్నాయి.

ఆండాళ్ తిరుప్పావై పారాయణం

12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరు. ఈమెను నాచియార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఈ ఏడాది నుంచి జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం అనే పథకాన్ని అమలు చేసిందని, దీనికి సంబంధించి యూపీఎస్సీ ద్వారా ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షల్లో 2023లో అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి చెన్నైయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి రూ.50 వేలు ప్రోత్సాహక నగదును అందజేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు జన్మభూమి. ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్ వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 19వ తేదీ వరకు గడువు ఉందని వివరించారు.

ఈవీఎంలపై అవగాహన



కలెక్టరేట్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తిరుపతి అర్బన్: 'మీ ఓటును మీరు ఎలా వేయాలి..ఓటు పడిందా లేదా ఎలా గుర్తించాలి' అనే అంశాలతోపాటు ఈవీఎంలపై పూర్తి అవగాహన కల్పించడానికి అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈ మేరకు వారం రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా 10 సెంటర్లను ఏర్పాటు చేసి, ఓటర్లకు ఈవీఎంలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఒక గుర్తుకు ఓటు వేస్తే.. మరో గుర్తుకు ఓటు పడుతుందనే అపోహలను తొలగిస్తున్నారు. మొత్తంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నారు.

20న పుత్తూరులో జాబ్‌మేళా

పుత్తూరు: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాను మంత్రి ఆర్కే రోజా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 25 కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన వారు మేళాకు హాజరుకావచ్చని సూచించారు.

రైతు రాజ్యం!



భూ హక్కు పత్రాలను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఇతర అధికారులు(ఫైల్)



రైతులకు అందించిన భూ హక్కు పత్రం

'పిడికెడు మెతుకులు పెట్టే అన్నదాతకు మంచి చేయాలి. దేశానికే వెన్నెముకగా నిలిచే రైతన్నకు బాసటగా నిలవాలి. వారి కష్టంలో తోడుండాలి. వారి నష్టాలను భరించాలి' అన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అధికారం చేపట్టిన వెంటనే కర్షకుల సమస్యలపై దృష్టి సారించింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఏళ్లగా సాగుచేసుకుంటూ ఆ భూములపై ఎలాంటి హక్కులూ లేని వారికి సర్వహక్కులూ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది. అంతేగాక ఆయా భూములకు ప్రభుత్వపరంగా రావాల్సిన రాయితీలు, రైతు భరోసా కల్పిస్తూ అండగా నిలిచింది. రైతు రాజ్యం వచ్చిందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

భూ సమస్యలపై సీఎం జగన్ దృష్టి

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షతో ప్రక్షాళన
- ఏళ్లనాటి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
- సాగులో ఉన్న భూమిపై సర్వహక్కులూ కల్పిస్తూ ఆదేశాలు
- భూహక్కు పత్రాలు పంపిణీ చేసిన అధికారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

చిల్లకూరు: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షలో భాగంగా భూ రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఇది ఒక వైపు కొనసాగుతుండగానే చుక్కల భూముల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేశారు. మరో వైపు 22ఏలో ఉన్న భూములను రెగ్యులర్ చేసేందుకు నడుం బిగించారు. నిషేధిత భూములు, సీజేఎఫ్ఎస్, అటవీ, అనాధీనం, అసైన్డ్, ఇనాం భూములను రెగ్యులర్ చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో మెట్ట, మాగాణి భూములపై రైతులు సర్వహక్కులూ పొందేందుకు మార్గం సుగమం చేశారు.

భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నో ఏళ్లుగా హక్కులు పొందకుండా భూమి సాగులో ఉన్న వారిని యంత్రాంగం గుర్తించింది. ఇందులో ఉన్న అండంకులను తొలగించి వివాదాలు లేకుండా రైతులను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా సుమారు 21 మండలాల్లో 1,104 మంది చిన్న, సన్న కారు రైతులను గుర్తించి వారికి 742.565 ఎకరాల భూమిపై హక్కు పత్రాలూ కల్పించింది. ఈమేరకు ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమక్షంలో భూపంపిణీ చేపట్టింది. దీంతో ఎన్నోఏళ్ల నాటి కల సాకారమైందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

జిల్లా సమాచారం

మండలం	రైతులు	పంపిణీ చేసిన భూమి(ఎకరాల్లో)
బాలాయపల్లి	57	67.41
బీఎన్ కండ్రిగ	14	5.35
చంద్రగిరి	24	15.655
చిల్లకూరు	136	102.18
చినగొట్టిగల్లు	9	9. 61
చిట్టమూరు	129	50.29
దక్కిలి	183	67.13
డీవీ సత్రం	36	24.69
గూడూరు	4	05.89
కేవీబీపురం	58	46.25
కోట	32	27.97
నారాయణవనం	4	8.69
ఓజిలి	17	4.53
పాకాల	7	15.15
పెళ్లకూరు	6	10.66
పిచ్చాటూరు	11	4.97
సూళ్లూరుపేట	38	26.68
తడ	60	37.53
వాకాడు	215	131.23
వెంకటగిరి	59	73.21
ఎర్రావారిపాళెం	5	7.49
మొత్తం	1,104	742.565

రెండో విడత కూడా..



జిల్లాలో సుమారు 742 ఎకరాలపై రైతులకు హక్కులు కల్పించాం. ఇంకా కొంత మందికి హక్కులు కల్పించేలా ఆయా మండలాల్లోని తహసీల్దార్లకు జాబితాను సిద్ధం చేయాలని సూచించాం. మరో రెండు నెలల్లో మరోసారి భూ పంపిణీ చేస్తాం. దీంతోపాటు హక్కు పత్రాలు అందించేలా చర్యలు చేపడుతున్నాం.

– పెంచలకిషోర్, డీఆర్‌ఓ, ఇన్‌చార్జ్ జేసీ తిరుపతి జిల్లా

కల సాకారం



గ్రామానికి దగ్గర్లో ఉన్న సర్వే నం.49-6లో కొంత భూమి ఉంది. దాన్ని ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. నా భర్త చనిపోయిన తర్వాత ఆ భూమికి పట్టాలు లేకపోవడంతో ఎవ్వరూ అప్పు కూడా ఇవ్వలేదు. కూలీనాలి చేసి పంట వేసుకుంటున్నా. ఆ భూమికి పట్టాలిస్తారేమోనని ఎన్నో ఏళ్లుగా ఏదురు చూశా. కానీ ఫలితం లేదు. నేడు సీఎం జగనన్న వచ్చిన తర్వాత ఆ భూమిపై సర్వహక్కులూ కల్పించారు. శాశ్వత భూహక్కు పత్రాలు అందించారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకి రుణపడి ఉంటాం.

– రాయపు పోలమ్మ, బురదగాలి కొత్తపాళెం, చిట్టమూరు మండలం

భూయజమానిగా మారాను



మా తాతముత్తాతల కాలం నుంచి కొంత భూమి సాగుచేసుకుంటున్నాం. ఆ భూమికి పట్టా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు రావు. బ్యాంకు నుంచి రుణం తీసుకుందామనుకున్నా ఇచ్చేవారు లేరు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మాకు ఊపిరి వచ్చింది. ఇటీవల వీఆర్‌ఓ వచ్చి పూర్తి వివరాలు తీసుకుని వెళ్లారు. ఆ తర్వాత కొన్ని రోజులకు పట్టా చేతిలో పెట్టారు. ఎంతో సంతోషంగా ఉంది. సీఎం జగనన్న మమ్మల్ని భూ యజమానులను చేశారు. ఆయన మేలు మరువలేం.

– కట్టా ముత్యాలమ్మ, చెంబడిపాళెం, కోట మండలం

ఆనందంగా ఉంది



మా గ్రామానికి దగ్గర్లో ఉన్న ప్రభుత్వ భూమి 97 సెంట్లు సాగు చేసుకుంటున్నాం. ఎప్పుడూ నేను పుట్టకముందు నుంచి ఇది సాగులోనే ఉంది. ఇందులో వేరుశనగ సాగుచేస్తుంటాం. ఈ భూమికి పట్టాలేదు. పంట సాగు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందేది కాదు. ఇప్పుడు పట్టాలు ఇవ్వడం సంతోషం కలిగించింది. ఇకపై రైతు భరోసాతోపాటుగా విత్తనాలు కూడా రాయితీపై తీసుకునే వీలుకలిగింది. పంట రుణాలు కూడా పొందవచ్చు.

– బండి నాగమునెయ్య, బల్లవోలు, చిల్లకూరు మండలం

జగనన్న పాలనలోనే పేదల జీవితాల్లో వెలుగులు



తిరుపతి 23వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు

చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒరగబెట్టిందేమీ లేదు

- ప్రజలను వంచించేందుకే బాబు, పవన్‌కళ్యాణ్ ఒక్కటయ్యారు
- 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ధ్వజమెత్తిన టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: 'టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓట్లేస్తే ప్రజలను నట్టేట ముంచేయడం గ్యారెంటీ' అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. నగరంలోని 23, 34, 48 డివిజన్లలో శుక్రవారం ఆయన 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జగనన్న సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత పేదలను ఆదుకునే నాథుడే కరువయ్యారన్నారు. అలాంటి సమయంలో పేదల కోసమే పుట్టిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ప్రతి పేదవాడికి నేనున్నానంటూ భరోసా కల్పించిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. జగనన్న చేస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక అటు చంద్రబాబు, ఇటు పవన్‌కళ్యాణ్ విషం కక్కుతున్నారని మండిపడ్డారు. 14ఏళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు ఏమి ఒరగబెట్టారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడానికి నోటికొచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి ప్రజలను మోసం చేయడం ఆయనకు అలవాటేనన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబుకు పవన్‌కళ్యాణ్ తోడయ్యారని ధ్వజమెత్తారు. ఎంతమంది ఏకమైనా ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారని గుర్తుచేశారు. ఒక్క తిరుపతిలోనే రూ.1,700 కోట్లతో అభివృద్ధి చేయడం జగనన్న వల్లే సాధ్యమైందన్నారు. తిరుపతి అభివృద్ధిపైన పచ్చ నేతలు, ఎల్లో మీడియా విషం కక్కుతున్నట్టు మండిపడ్డారు. తిరుపతి అభివృద్ధి చెందడం వారికి ఇష్టంలేనట్లుగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తలారి రాజేంద్ర, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, అన్నా సంధ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సురేంద్రరెడ్డి, పడమటి కుమార్, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టికిషోర్, మద్దాలి శేఖర్, పార్టీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, రఘునాథరెడ్డి, ఊతుకుంట మోహన్, రమణమ్మ, కోటి, రమణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 56,049 మంది స్వామివారిని దర్శించుకోగా, 26,748 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అప్రెంటీస్ శిక్షణ

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో అప్రెంటీస్ శిక్షణ పొందడానికి ఈనెల 20వ తేదీన తిరుపతి డీపీటీవో కార్యాలయంలో డిపోల కేటాయింపు ఉంటుందని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మెకానిక్ డీజిల్-31, మెకానిక్ మోటార్-6, ఎలక్ట్రీషియన్-8, వెల్డర్-1, పెయింటర్-1, ఫిట్టర్-1, డ్రాఫ్ట్‌మన్ సివిల్-1, మొత్తంగా ఐటీఐ అభ్యర్థులు 49 మంది డీపీటీవో కార్యాలయంలో ఉదయం 10 గంటకల్లా హాజరయ్యి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు శిక్షణకు డిపోల కేటాయింపు ఉంటుందని ఆయన తెలిపారు.

నీలిమేఘాలలో.. మంచు కెరటాలలో..!



శ్రీకాళహస్తిలో కైలాసగిరులను కప్పేసిన మంచు మేఘాలు





తిరుమలలో దట్టమైన పొగ మంచు

తిరుపతి జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. ప్రకృతి ఆహ్లాదకరంగా మారి కనువిందు చేసింది. మధ్యాహ్నం నుంచి తుంపర్లతో ప్రారంభమైన వాన సాయంత్రానికి చిరుజల్లులుగా మారింది. తిరుమల శ్రీవారి సన్నిధితో పాటు ఘాట్‌రోడ్లలో దట్టమైన మేఘాలు కమ్మేయడంతో లైట్లు వేసుకుని వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. దట్టమైన పొగమంచు కారణంగా టీటీడీ పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాలను తాత్కాలికంగా మూసివేసింది. శ్రీకాళహస్తిలో కైలాసగిరులపై మంచు మేఘాలు నాట్యం చేసినట్టుగా భక్తులను మైమరపించాయి. భక్తకన్నప్ప కొండపై కొలువైన శివపార్వతులు ఆకాశం నుంచే ప్రత్యక్షమయ్యారా..! అన్నట్టు పురప్రజలను పరవశింపచేశాయి.

– తిరుమల/శ్రీకాళహస్తి

వ్యవసాయంలో తిరుపతి జిల్లా టాప్

తిరుపతి అర్బన్: వ్యవసాయ విభాగానికి సంబంధించి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవల్లో నవంబర్ మాసంలోనూ తిరుపతి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తమ వ్యవసాయశాఖ అధికారిగా ఎస్.ప్రసాద్‌రావును ఎంపిక చేశారు. ఉత్తమ అగ్రికల్చర్ అసిస్టెంట్లను ఒక్కో జిల్లా నుంచి ఒకరు చొప్పున మొత్తం 26 మందిని ఎంపిక చేయగా.. అందులో తిరుపతి జిల్లా నుంచి రేణిగుంటకు చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను తిరుపతి జిల్లా ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేశారు. ఆ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ శుక్రవారం వివరాలను ప్రకటించారు.

సమష్టి కృషితోనే విజయం



సమష్టి కృషితోనే తిరుపతి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాదిలోనే ఇప్పటి వరకు ఆరు సార్లు తిరుపతి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడం చిన్న విషయం కాదు. విజయానికి ప్రధాన కారణం అధికారులు, ఉద్యోగులే. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం.

– ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



శ్రీవారి సేవలో దీపిక

తిరుమల శ్రీవారిని సినీనటి దీపికా పదుకోన్ శుక్రవారం సేవించుకున్నారు. అలిపిరి నడక మార్గం మార్గం ద్వారా ఆమె తిరుమలకు చేరుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

– తిరుమల

క్లుప్తంగా

17న గ్రూప్‌-2పై ఉచిత అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీవిద్య ఐఏఎస్ అకాడమీలో ఆదివారం ఉదయం 10గంటలకు గ్రూప్‌–2 పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు జరుగుతుందని అకాడమీ కో–ఆర్డినేటర్ ఎం.గుణవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సదస్సుకు ముందు ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రూప్‌-2కు సిద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 70131 19918 సంప్రదించాలని ఆమె కోరారు.

రక్షణ గోడను ఢీకొన్న కారు

తిరుమల : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొన్న ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. అనంతరం తిరుమల నుంచి కారులో మొదటి ఘాట్ రోడ్డులో కిందకు దిగుతుండగా మార్గమధ్యంలో కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది కారును పక్కకు తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదాలపై తస్మాత్ జాగ్రత్త

- జిల్లాలో విస్తృతంగా అవగాహన సదస్సులు
- కలెక్టర్, డీటీఓ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు



వాహనాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐలు సుబ్రమణ్యం, కుసుమ, శ్రీనివాసరావు, స్వర్ణలత

తిరుపతి మంగళం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి(డీటీవో) సీతారామిరెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, సూళూరుపేట ప్రాంతాల్లో మోటర్ వెవికల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ)లు నిత్యం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లోని డ్రైవర్లు, విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక బృందాలతో అవగాహన సదస్సులు

రోడ్డు ప్రమాదాల నివారణపై రవాణాశాఖ(ఆర్టీఏ) అధికారులు నిత్యం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రోజూ రవాణాశాఖలోని ఎంవీఐ స్థాయి అధికారులతో పాటు కొంతమంది సిబ్బందిని అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు డీటీవో సీతారామిరెడ్డి కేటాయించారు. అందులో భాగంగా గత రెండు రోజులుగా ఎంవీఐలు శ్రీనివసవావు, సుబ్రమణ్యం, కుసుమ, స్వర్ణలత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో పాటు బస్సు, వ్యాను డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. వారితో పాటు ఆటో డ్రైవర్లకు, ఆర్టీసీ డిపోల్లో డ్రైవర్లకు, ట్యాక్సీ డ్రైవర్లకు రోడ్డు ప్రమదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ట్యాక్సీ యూనియన్ నాయకులు, ట్రావెల్స్ యజమాన్యానికి కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఎప్పటికప్పుడు రోడ్లపై వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, తిరుమలలోని ఎస్వీ హైస్కూల్ విద్యార్థులతో పాటు ఆటో, ఆర్టీసీ, ట్యాక్సీ డ్రైవర్లకు రోడ్డు ప్రమదాల నివారణపై అవగాహన కల్పించారు.

కలెక్టర్ ప్రత్యేక చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా, పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. దాంతోపాటు నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో తగుచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా రవాణా, పోలీస్‌శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నిత్యం వాహనాలను తనిఖీచేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమా



రవాణాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు చర్యలు తప్పవు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదు, హెల్మెట్, సీటు బెల్ట్ పెట్టుకోవాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదు. ఓవర్‌లోడు, అధిక స్పీడు వెళ్లరాదు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అలాగే స్కూల్స్, కళాశాలల బస్సుల్లో తప్పకుండా ఫస్ట్ ఎయిడ్ బాక్స్, విద్యార్థులు ఎక్కడానికి అనువుగా మెట్లు, ఎమర్జెన్సీ ద్వారాలు, ఫైర్ యంత్రాలు తప్పనిసరిగా ఉండాలి. అలా పాటించని వారికి జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం

సీతారామిరెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి (డీటీఓ)

ప్రగతితో ఆదర్శ గ్రామాలుగా పల్లెలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



ఎస్టీ కాలనీలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

చంద్రగిరి: నియోజకవర్గంలోని పల్లెలు ప్రగతి వైపు పరుగులు తీస్తూ ఆదర్శ గ్రామాలుగా అవతరిస్తున్నాయని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్‌రోడ్డుపల్లె పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డితో కలిసి హర్షిత్‌రెడ్డి నిర్వహించారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు ప్రతి గడపలో సంతోషాన్ని నింపడంతో పల్లె జనం జగనన్నకు జేజేలు పలుకుతున్నారని ఆయన చెప్పారు. గ్రామంలో ప్రతి గడపలో ఆత్మీయతను పంచుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకున్నారు. ఆయా గ్రామస్తులు నివేదించిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో చంద్రగిరిని నిలిపేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. నవరత్నాల పథకాలతో అర్హత కలిగిన ప్రతి కుటుంబం సుమారు రూ.3లక్షల వరకు లబ్ధి పొందినట్లు చెప్పారు. మరోసారి జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఈఓపీఆర్డీ శశిరేఖ, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, ఎంపీటీసీ సులోచన, మండల పార్టీ అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, మట్టా మధుసూదన్‌రెడ్డి, నాయకులు మోహన్ నాయుడు, రమేష్, బాలాజీ, దాము, పసల నాగరాజు, హైమావతి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

క్రమపద్ధతిలో టీడీఆర్, గిఫ్ట్ డీడ్ వివరాలు



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో ఏర్పాటు చేసిన, చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం జారీ చేసిన టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబల్ డెవెలప్‌మెంట్ రైట్స్) బాండ్ల వివరాలు, అదేవిధంగా స్థల యజమానులు రాసిచ్చిన గిఫ్ట్ డీడ్‌ల వివరాలను ఓ క్రమ పద్ధతిలో తయారు చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం టీడీఆర్ స్క్రూటిని కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష హోదాలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పాల్గొని, అధికారులకు పలు సూచనలు చేశారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ కుమారన్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తిరుపతి సబ్ రిజిస్ట్రార్ సినీయర్ సహాయకులు జనార్దన్, కమల్ నాథ్, తుడా ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశు వైద్య విద్య సమాచార కేంద్రం, హైదరాబాద్‌కు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎన్‌ఏఏఆర్ఎం) సంయుక్త ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా మహిళలకు, నిరుద్యోగులకు పాలు, మాంసకృత్తుల ఉత్పత్తులపై జరిగిన అవగాహన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పేడు పరిసర ప్రాంతాల పెద్ద సంఖ్యలో విచ్చేసిన మహిళలకు, నిరుద్యోగులకు విలువ ఆధారిత పాలు, మాంసపు ఉత్పత్తుల తయారీపై వర్సిటీ అధికారులు, ఎన్‌ఏఏఆర్ఎం అధికారులు అవగాహన కల్పించారు. ఎన్‌ఏఏఆర్ఎం చెందిన అధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, డాక్టర్ జి.వెంకటనాయుడు, డాక్టర్ ఎం.బాలక్రిష్ణన్, కోఆర్డినేటర్, సైంటిస్ట్ డాక్టర్ సుజాత, డీన్స్ డాక్టర్ రవీంద్రారెడ్డి, జగపతిరామయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ హత్య కేసులో ఏడుగురి అరెస్ట్

తిరుమల: ఆటో డ్రైవర్ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు తిరుపతి ఈస్ట్ పోలీసులు తెలిపారు. వారి కథనం.. ఈనెల 10వ తేదీ రాత్రి తిరుపతి కొత్తపల్లి చిరంజీవి రోడ్డులో చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కిశోర్(29) దారుణ హత్యకు గురయ్యాడు. పాత కక్షలే హత్యకు గల కారణమని మృతుని అక్క ఎం.ప్రమీల ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోలీసులు ఈనెల 11వ తేదీ కేసు నమోదు చేశారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈస్ట్ ఇన్‌స్పెక్టర్ డీ.మహేశ్వరరెడ్డి పలు బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగి ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిలు కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన షేక్ అఫ్రోజ్ (21), ముప్పాళ లోకేష్ (21), నక్ల బలరామ్ (23), ఎరుకుల కాలనీకి చెందిన పెనిబేటి దేవేంద్ర(22), చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన మట్లవల్లి జనార్దన్ (21), అశోక్‌నగర్‌కు చెందిన విర్రూరి వెంకట శివకుమార్, తిరుపతి పీకే లేఔట్‌కు చెందిన హరికేశవ (25)తో పాటు మరో ఇద్దరు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించారు. అఫ్రోజ్‌కు, చనిపోయిన కిశోర్‌కు మధ్య పాత కక్ష్యలు ఉన్నాయని విచారణలో తేలింది. మృతుడు కిశోర్‌పై అఫ్రోజ్ కక్ష పెంచుకొని తన స్నేహితులతో ముందస్తు ప్రణాళి ప్రకారం దాడి చేయాలని నిశ్చయించుకున్నారు. ముందుగా కిశోర్‌ను ఒడిసిపట్టుకోగా.. దేవేంద్ర, లోకేశ్ తమవెంట తెచ్చుకున్న కత్తులతో పొడిచి మోటార్ సైకిళ్లలో పారిపోయారు. కిశోర్ కొంతముందుకు పోయి మురికి కాలువపై గల కాంక్రిట్ రోడ్డు పై కుప్పకూలి చనిపోయాడని గుర్తించారు.

కాలుజారిపడి కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్: మేనకూరు సెజ్ పరిధిలోని ఓ పరిశ్రమలో కార్మికుడు పారి వెంకటేశ్వర్లు(46) శుక్రవారం ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి మృతిచెందాడు. పోలీసుల కథనం.. ఓజిలి మండలం, పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో రోజువారి కార్మికుడు. శుక్రవారం యథావిధిగా పరిశ్రమలో సుమారు 30 అడుగుల ఎత్తులో ఉండే షేడ్డు వద్ద కొంతమంది కార్మికులతో కలిసి మరమ్మతు పనులు చేస్తున్నాడు. షేడ్డు అంచున పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కార్మికులు గుర్తించి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్వర్లు మృతిచెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సీఐ నరసింహారావు పరిశ్రమ వద్దకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న కార్మికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలో ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లో యాజమాన్యం ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా కార్మికులతో పనులు చేయిస్తున్నందువల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్న దగ్గరకు వెళ్తూ అనంత లోకాలకు

తిరుపతి రూరల్: అన్న దగ్గరకు వెళ్తూ ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన శుక్రవారం మండలంలో విషాదాన్ని నింపింది. వివరాలు.. పిచ్చాటూరు మండలం, నీరువాయికు చెందిన బీ.సామ్యేల్(17) తిరుపతిలో క్రేన్ ఆపరేటర్. తన అన్నను పరామర్శించేందుకు శుక్రవారం తిరుపతికి వచ్చాడు. చెర్లోపల్లి సమీపంలో పనిలో ఉన్న సోదరుడుని కలిసేందుకు పేరూరు విద్యానగర్ వద్ద వేచి ఉన్నాడు. అదే సమయంలో తిరుపతి నుంచి చెర్లోపల్లి వెళ్తున్న క్రేన్ డ్రైవర్ ధనుష్ విద్యనగర్ వద్ద సామ్యేల్‌ను చూసి క్రేన్ ఆపాడు. మీ అన్న వద్దకే వెళ్తున్న రా..! అంటూ క్రేన్ ఎక్కమన్నాడు. దీంతో క్రేన్ ఎక్కేందుకు ప్రయత్నించిన సామ్యేల్ తొందరపాటులో కాలు జారీ కిందపడ్డాడు. గమనించని డ్రైవర్ ధనుష్ క్రేన్‌ను ముందుకు పోనివ్వడంతో చక్రల కింద పడి సామ్యేల్ నలిగిపోయాడు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన ధనుష్‌ను అదుపులో తీసుకున్నాడు. మృతుడి సోదరుడు అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

అది చట్ట విరుద్ధం

తిరుపతి తుడా: ఆయుర్వేద వైద్యులు అలోపతి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు, ప్రసవాలు చేయడం చట్ట విరుద్ధమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. తిరుపతి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని ఆయుర్వేద వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తల్లి, ఇద్దరు బిడ్డలు మృతి చెందడంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేయడం, కాన్పులు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు.

ఏఎస్పీకి ఎస్పీగా పదోన్నతి

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాస్‌కు పదోన్నతి లభించింది. ఎర్రచందనం అక్రమ రవాణా నిర్మూలన టాస్క్‌ఫోర్స్ విభాగపు ఎస్పీగా తిరుపతి జిల్లాలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2011 ఏప్రిల్‌లో సివిల్ డీఎస్పీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్.. హైదరాబాద్ సీఐడీ అధికారిగా, పుట్టపర్తి, గుంటూరు క్రైం అర్బన్, తుళ్లూరు డీఎస్పీగా పనిచేశారు. ఏపీఎస్ ఆర్టీసీ అదనపు ఎస్పీగా పని చేశారు. అదే హోదాలో విజయవాడ ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తూ పదోన్నతి పొందారు. ఆయనను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

అద్భుతం కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూం

– విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

నెల్లూరు(బృందావనం): వివాహాది శుభకార్యాల్లో స్త్రీమూర్తులతోపాటు అందరూ ధరించే సనాతనమైన, నూతనమైన వస్త్రాలతో నెల్లూరులో కొత్తగా ప్రారంభించిన కాంచీపురం పెరుమాళ్ శిల్క్స్ షోరూం ఎంతో అద్భుతంగా ఉందని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డు అన్నమయ్య సర్కిల్‌లో కాంచీపురం పెరుమాళ్ శిల్క్స్ షోరూంను గురువారం స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షోరూంలోని రకరకాల వస్త్రాలు కనువిందు చేస్తున్నాయన్నారు. ప్రతి మహిళ, స్త్రీమూర్తి ఆభరణాలను, వస్త్రాలను ధరించి పరిపూర్ణంగా ఉండాలన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ బయ్యా శ్రీనివాసులు, రవికుమార్ నెల్లూరులో తొలుత న్యూరాజ్యలక్ష్మి హాల్‌ను, ఆ తరువాత శుభమస్తు షాపింగ్ మాల్స్‌ను స్థాపించి అనంతరం నగరంలోనూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కాంచీపురం పెరుమాళ్ శిల్క్స్‌ను ఆధునిక హంగులతో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద వెడ్డింగ్‌మాల్ కాంచీపురం పెరుమాళ్ శిల్క్స్‌ను నెల్లూరులో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఆ షోరూం అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ సోదరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, బాలీవుడ్ సినీనటి దీపికా పదుకొనే దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం.. బీహార్‌కు చెందిన కొంతమంది పదేళ్ల క్రితం గూడూరుకు వచ్చి వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో కొందరు సాయిబాబా ఆలయ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద పంక్చర్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఉన్న ఎండీ ఇర్షద్(26) అనే వ్యక్తి చిల్లకూరులోని మసీద్ వద్ద నమాజుకు స్కూటీపై బయలుదేరాడు. సర్వీస్ రోడ్డులో చిల్లకూరు నుంచి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఇర్షద్‌ను ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇటీవలే వివాహమైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం అనుకుని పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : మద్యం అనుకుని పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తొట్టంబేడు మండలంలోని గుండేలుగుంటలో శుక్రవా రం చోటుచేసుకుంది. ఎస్ఐ రాఘువేంద్ర కథనం మేరకు.. గుండేలుగుంటకు చెందిన చక్రపాణి(57) ముందురోజు రాత్రి మద్యం తెచ్చుకుని ఇంట్లో దాచుకున్నాడు. ఉదయమే మద్యం బాటిల్ అనుకుని దాని పక్కనే ఉన్న పురుగుల మందు బాటిల్ తీసుకెళ్లి తాగేశాడు. ఆపై కుటుంబ సభ్యులు గుర్తించి చక్రపాణిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏనుగుల కట్టడికి ప్రత్యేక బృందం ఏర్పాటు



ఏనుగుల సంచార ప్రాంతాలను పరిశీలిస్తున్న చిత్తూరు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి

పాకాల: పంటలపై వరుసగా దాడులు చేస్తున్న ఏనుగుల కట్టడికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చిత్తూరు డీఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వల్లివేడు, పదిపట్లబైలు, పేరసానిపల్లె పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఏనుగుల సంచారం పాకాల, పీలేరు, పులిచర్ల రెవెన్యూ గ్రామాల ప్రాంతాల్లో అధికంగా ఉందని చెప్పారు. ఈ టీంలో పలమనేరు ఏఆర్ఈ డీఎఫ్ఓ, చిత్తూరు ఎఫ్ఆర్ఓ థామస్ సుకుమార, వెస్ట్ ఎఫ్ఆర్ఓ బాలకృష్ణారెడ్డి, హేమలత ఉన్నారని తెలిపారు. ఏనుగుల సంచారంపై వీరంతా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.